మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# 12 గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసుల దాడులు

### పలువురిపై కేసు నమోదు, బెల్టు షాపులపై కూడా చర్యలు జరపాలంటున్న ప్రజలు

**నారాయణపేట ప్రతినిధి, జూలై 13 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా ఎక్సైజ్ సుపరింటెండెంట్ ఏం. సుధాకర్ ఆదేశాల మేరకు నారాయణపేట్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కల్లు దుకాణాలపై తాండాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. నారాయణపేట టౌన్ , ఎక్లాస్ పూర్, జలాల్ పూర్, భైరం కొండ పేరపళ్ళు కచ్వార్, సంగంబండ, తిప్రస్ పల్లి, మల్లెపల్లి, పులిమామిడి, పెద్దజట్రం, ధన్వాడ 12 గ్రామాల్లో కల్లు దుకాణాలపై ఆకస్మిక దాడులు చేసి శాంపిల్ సేకరించి కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ బి.అనంతయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారాయి తయారు చేస్తున్నారన్న సమాచారంతో బుడ్డగానీ తాండాకు చెందిన బుజ్జమ్మ, తిమ్మారెడ్డిపల్లి తండాకు చెందిన శాంతమ్మ, మంగమ్మ, అంతమ్మలపై కేసులు నమోదు చేసి వారి నుంచి 11లీటర్ల నాటు సారా కిలో నవసాగ్రంను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. నాటుసారా, కల్లును కల్తీ చేసి అమ్మేవారిపై, గంజాయి విక్రయించే వారిపైనా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో నారాయణపేట సీఐలు కవితా సుధీర్, రమేష్, శిరిషా ఎస్ఐలు సురేష్, క్రిష్ణవేణి, సంతోష్, మౌనిక కానిస్టేబుల్, ఖాజపాషా హెచ్‌సి పాల్గొనడం జరిగిందని పేర్కొన్నారు.




సారా తయారు చేస్తున్న మహిళను అరెస్టు చేసిన పోలీసులు



అమరచింత జడ్.పి.హెచ్.ఎస్‌లో అదనపు గదులను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీహరి

# గతంలో బడులను పట్టించుకోలే..

### విద్యపై అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించను
### రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

**అమరచింత, జూలై 13, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తుందని విద్యాధికారులు నిరక్ష ్యంల వస్తే సహించని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం అమరచింత మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో అదనపు తరగతుల గదులను ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అలాగే సింగంపేట గ్రామంలో అంగన్వాడి నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో పాఠశాలలు ప్రారంభమై నెలలు గడిచినా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యార్థులకు స్కూలు యూనిఫాం ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వం సహాయంలో స్కూలు ప్రారంభం ముందే రాష్ట్రంలో ఉన్న పాఠశాలలకు పాఠ్య పుస్తకాలతో పాటు విద్యార్థులకు యూనిఫామ్ అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. విద్యపై ప్రధానోపాధ్యాయులు టీచర్లు విద్యార్థులపై శ్రద్ధ పెట్టాలని ఆయన కోరారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని విద్యాధికారులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలని ప్రభుత్వం విద్యార్థులకు మెనూ చార్జీలు పెంచిందని తెలిపారు. అలాగే టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని, విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కేజీ మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు, మహంకాళి విష్ణు, తిరుమలేష్, తౌఫిక్, విష్ణు, హనుమంతు నాయక్, రఫీ, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# వరద తగ్గుముఖం

- జూరాల, శ్రీశైలం డ్యాంల నుంచి ఒక గేటు ద్వారా నీటి విడుదల
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 13, ప్రభాతవార్త:** ఎగువన కర్ణాటక నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో డ్యాంలకు ఇన్‌ఫ్లో తగ్గుతూవస్తున్నది. జూరాల డ్యామ్‌కు వరద స్వల్పంగా తగ్గింది. ఆదివారం జూరాలకు 65,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.380 టీఎంసీల –మిగతా4లో..

# విద్యా రంగంలో వినూత్న మార్పు



- వంగూరులో తొలి తెలంగాణ పబ్లిక్ స్కూల్
- ఈ ఏడాది నుంచే తరగతలు ప్రారంభం
- వంగూరు జెడ్పీ హైస్కూల్ తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా మార్పు

తెలంగాణ రాష్ట్రంలోనే ప్రప్రథమంగా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తెలంగాణ పబ్లిక్ పాఠశాలగా మారుస్తూ ఈ నూతన విద్యా సంవత్సరం నుండే ఎల్‌కేజీ నుండి ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేస్తూ అన్ని తరగతుల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రయోగాత్మకంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ అందుకు అనుగుణంగానే ఇలాంటి పాఠశాలలను నెలకొల్పి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారు.

వంగూరు, జూలై 13 ప్రభాతవార్త

రాష్ట్రంలోనే ప్రథమంగా వంగూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా మారుస్తూ, ఈ నూతన విద్యా సంవత్సరం నుండే ఎల్‌కేజీ నుండి ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేస్తూ అన్ని తరగతుల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయనున్నారు. వంగురు మండల కేంద్రంలో ప్రయోగాత్మకంగా నెలకొల్పిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ అభివృద్ధికి 30 మంది విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు నూతనంగా కమిటీని ఏర్పాటు చేశారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో పారదర్శకంగా నిధుల నిర్వహణ చేపట్టి మెరుగైన విద్య ఫలితాలను పొందేందుకు కమిటీ సభ్యులు పూర్తిస్థాయిలో పని చేయనున్నారు. విద్యార్థి కేంద్రంగా విద్యావ్యవస్థ అభివృద్ధి కావాలని, మండలంలోని పెద్ద పాఠశాలగా తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నాణ్యమైన విద్య లభిస్తుంది. ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచేందుకు, పాఠశాలల అభివృద్ధికి గ్రేడింగ్ ఇవ్వాలని ఆలోచిస్తున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రుల నుంచి సేకరించిన అభిప్రాయాలు, సిఫారసులు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేయడానికి అయినా సిద్ధంగా ఉంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులతో పాటు విద్యాభివృద్ధిపై సమాలోచన సమావేశాన్ని నిర్వహించారు. విద్యాభివృద్ధి అనేది ఒక సామాజిక బాధ్యత అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి అనేక చర్యలు చేపట్టడంతో గ్రామాల్లో ఉన్న ప్రతి పౌరుడు ఉద్యోగులు వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు సామాజిక బాధ్యతతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు పాఠశాలలకు అండగా నిలవాల్సి ఉంది. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని, నూతన ఆవిష్కరణలతో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు పోటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతుంది. ఉపాధ్యాయులు తమ బోధనలో నైపుణ్యాన్ని పెంచుకోవడంతో పాటు, విద్యార్థుల శ్రేయస్సు కోసం తల్లిదండ్రులు, సమాజంతో సమన్వయం పాటించాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగేలా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం విద్య కమిషన్ కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వం గత మాసంలో సబ్జెక్ట ఉపాధ్యాయులకు నైపుణ్యాలపై శిక్షణా తరగతులను నిర్వహించారు. ఆ శిక్షణా తరగతుల్లో పొందిన అంశాలను సబ్జెక్టు ఉపాధ్యాయులు తప్పనిసరిగా తరగతి గదుల్లో అమలు చేసి విద్యార్థుల సామర్థ్యాలను మరింతగా మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాల్సి ఉంటుంది.

### ఉచిత బస్సు సౌకర్యం.. మధ్యాహ్న భోజనం..

వంగూరు పరిసర ప్రాంతంలో ఉన్న గ్రామీణ విద్యార్థులను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలకు తరలించేందుకు కార్పొరేట్ పాఠశాల మాదిరిగా ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించి ఉదయం 8 గంటల వరకు పాఠశాలకు విద్యార్థులను తీసుకొచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించి ఆ విద్యార్థులను వారి వారి గ్రామాలలో ఉచిత బస్సు ద్వారా వదిలిపెట్టనున్నారు. వంగూరు మండల కేంద్రంలో 14 ఎకరాలలో ఆహ్లాదకరమైన వాతావరణంలో 12 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్న సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలోకి 6 పాఠశాలలను, జూనియర్ కళాశాలను ఒకే చోటుకు తరలించి 1500 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను భోజనాన్ని అందించి కార్పొరేట్ తరహాలో విద్యార్థుల మేధస్సును పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్య కమిషన్ కమిటీ అహర్నిశలు కృషి చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలలో సమావేశాన్ని ఏర్పాటు చేసి విద్య అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసింది.

### నిర్వాహకుల అలసత్వం...

అన్ని ఉన్న అల్లుడు నోట్లో శని అన్నట్లుగా వంగూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సెమీ రెసిడెన్షియల్ పాఠశాలకు నిర్వాహకుల అలసత్వం వలన గ్రహణం పడుతుంది. గ్రామ పెద్దలతో కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ సరైన సమయంలో సమాచారం ఇవ్వకపోవడం వల్ల ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా పాఠశాలలో నిర్వహించాల్సిన పనులు నిలిచిపోతున్నాయి. మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో ఏర్పాటు చేయనున్న మరో రెసిడెన్షియల్ పాఠశాల పనులు వేగవంతంగా కొనసాగడంతో పాటు ఆ పాఠశాల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన విద్య కమిటీ సభ్యులు ఉత్సాహంతో తమ గ్రామంలో ఉన్న పాఠశాలలను అభివృద్ధి పరచుకోవాలనే సంకల్పంతో ప్రభుత్వం అందించే నిధులతో పాటు తమ వంతుగా చందాలు నిర్వహించి పాఠశాల బలోపేతానికి కృషి చేస్తుంటే... వంగూరు మండల కేంద్రంలో ఉన్న విద్యా కమిటీపై అధికారులు పాఠశాల అభివృద్ధిపై నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పుకోవచ్చు.

### సెమీ రెసిడెన్షియల్ ఏర్పాటుకు కమిషన్ సభ్యుల కృషి



రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సొంత మండలమైన వంగూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సెమీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు ఈ ప్రాంత వాసి సీఎంకు సన్నిహితుడైన విద్య కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్ ఎంతో కృషి చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న బడుగు బలహీన వర్గాల విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉన్న సన్నిహిత్యంతో పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపేందుకు ఆరాటపడుతున్నారు. రెండో విడతలో చారకొండ మండల కేంద్రంలో సెమి రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేసి ఆ ప్రాంత విద్యార్థులకు అందుబాటులో విద్యను అందించేందుకు కృషి చేస్తామని చారకొండ వెంకటేష్ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో వంగూరు, చారకొండ మండలాల్లో విద్య, వైద్యం, వ్యవసాయ శాఖల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

# వేర్వేరుగానే పంచాయతీ ఎన్నికలు

### ఇటిక్యాల 14, ఎర్రవల్లి మండలంలో 15 జీపీలు

**ఇటిక్యాల, జూలై 13 ప్రభాతవార్త :** గత ప్రభుత్వంలో ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని 29 గ్రామపంచాయతీలు 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు ఇటిక్యాల మండలం పరిధిలోని జరిగాయి. అయితే 2024 ఫిబ్రవరి నెలలో సర్పంచుల పదవులు పూర్తికాగా జూన్ రెండవ వారంలో ఎంపిటిసి. జెడ్పిటిసి పదవుల కాలం పూర్తయ్యాయి. అప్పటి నుండి గ్రామాలలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతూ వస్తుంది. 35 సంవత్సరాల క్రితం మండలాల ఏర్పాటు తర్వాత ఇటిక్యాల మండలంలో 23 గ్రామపంచాయతీలు ఉండగా 12 ఎంపీటీసీ స్థానాలు ఉండేవి. 2018 సంవత్సరంలో గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్ చట్టాన్ని పునర్వ్యవస్థరీకరించి మండలంలో 500 జనాభా పైగా ఉన్న 6 గ్రామాలను కొత్త గ్రామపంచాయతీలుగా ప్రభుత్వం ఏర్పాటు చేయగా 2019లో జరిగిన –మిగతా4లో..




# బీసీలకు 42శాతం రిజర్వేషన్ చరిత్రాత్మకం

### మహబూబ్‌నగర్‌లో నాయకుల సంబురాలు



మహబూబ్‌నగర్‌లో సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 13 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను తీర్మానిస్తూ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించడం చరిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దేవరకద్ర ఎమ్మెల్యే బి. మధుసూదన్ రెడ్డి సూచన మేరకు ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ దగ్గర అంబేద్కర్ చౌరస్తాలో ఓబీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు బండి మల్లేష్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కన్యాకుమరి నుండి కాశ్మీర్ వరకు భారత్ జోడోయాత్ర లో యాత్ర చేసిన రాహుల్ గాంధీ బడుగు బలహీన వర్గాలకు అన్ని విధాలుగా న్యాయం జరగాలంటే వాళ్ల జనాభా ఎంతో వాళ్లకు వాటా కూడా అంతే ఉండాలని అప్పుడే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ కుల గణన చేపట్టి 42బీసీ రిజర్వేషన్ తప్పకుండా చేస్తామని మాట ఇచ్చి నిలబెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ క్యాబినెట్ మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిసిసి మహిళా అధ్యక్షురాలు చలువ గాలి వసంత, కన్వీనర్ సిజే బెనహర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలీ, సీనియర్ నాయకుడు చలువగాలి రాఘవేందర్ రాజు, సాయిబాబా, అవేజ్ ,రాములు యాదవ్, గంజి ఆంజనేయులు, చంద్రశేఖర్, శేఖర్ ,తాహిర్ బాయ్, మాజీ కౌనిలర్లు నాగరాజు, శ్రీనివాసులు, ప్రశాంత్, కుమార్, జగదీష్, అలీబాయ్, వెంకట్‌లక్ష్మి, విజయలక్ష్మి, సహజ ,రామలక్ష్మి, మురళి, జహీర్‌బాయ్, పరమేశ్వర్,కిరణ్ ముదిరాజ్, నరసింహ, శ్రీను, అనుప, ఆంజనేయులు, మురళి, అజీజ్ పాల్గొన్నారు.

# అధ్వానంగా ధన్వాడ పాఠశాల

- ముఖ్యమంత్రి సొంత జిల్లాలో బడి పరిస్థితి
- పందులకు నిలయంగా మారిన ప్రభుత్వ పాఠశాల
- తాగునీరు లేక బోరు నీరే గతి
- మెనూ పాటించడంలేదని విద్యార్థుల ఆరోపణ
- పట్టించుకోని అధికారులు



పాఠశాలలో పందులు స్వైరవిహారం

**ధన్వాడ, జూలై 13 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీసుకెళ్తున్నామని ఓ వైపు అధికార యంత్రాంగం తెలుపుతుండగా సీఎం సొంత జిల్లాలోనే అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. ధన్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే వసతులు సరిగా లేవని విద్యార్థుల ఆరోపణలతో ధన్వాడ మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం గుడ్డు పెట్టడం లేదని పట్టణ అధ్యక్షులు డీ.మల్లేష్ గౌడ్ ఆరోపించారు. విద్యార్థులకు భోజనం కూడా సరిగ్గా పెట్టడడం లేదని, తినడానికి డైనింగ్ హాల్ ఉన్నా నిరుపయోగంగా ఉందని, విద్యార్థులు ఆరుబయట చెట్ల కింద భోజనం చేసే సమయంలో విద్యార్థుల పక్కన పందులు కుక్కలు, మేకలు తిరగుతుండటం పట్ల బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. తాగడానికి నీరు లేక బోరు నీటిని తాగుతున్న పరిస్థితి ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వపాఠశాలలపై శ్రద్ధ తీసుకుంటామని కార్పొరేట్ బడులకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతామని గొప్పలు చెప్పడం తప్ప సీఎం సొంత జిల్లాలో పాఠశాలలో అధికారం యంత్రాంగం పనిచేయడం లేదని బీఆర్ఎస్ యువ నాయకుడు ఇర్ఫాన్ ఆరోపించారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సుభాషిణి

# మైనార్టీల స్థితిగతులపై అధ్యయనం చేయాలి

- రాజ్యాంగంపై బిజెపికి నమ్మకం లేదు
- అవాజ్ బహిరంగ సభలో మాజీ ఎంపీ సుభాషిణి ఆలీ

**గద్వాల టౌన్, జూలై 13, ప్రభాతవార్త:** దేశంలోని మైనార్టీల స్థితిగతులపై పూర్తి స్థాయిలో అధ్యాయనం చేయాలని, భారత రాజ్యాంగంపై బీజేపీ కి నమ్మకం లేదని అందుకనే రాజ్యాంగం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మాజీ ఎంపీ సుభాషిణి ఆలీ అన్నారు. ఆవాజ్ రాష్ట్ర 3 వ మహాసభల సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని మక్కా మసీదు నుంచి ర్యాలీ ప్రారంభించి, పట్టణ పుర విధులలో ర్యాలీ నిర్వహించి తేరు మైదానంలో అతికూర్ రెహమాన్ సభాధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపికి రాజ్యాంగం పట్ల నమ్మకం లేదని, అందుకే రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి అమలులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సిఎఎ, ఎన్ఆర్‌సీ చట్టం వల్ల మైనార్టీ హక్కులకు భంగం కలిగిందని –మిగతా4లో..

# మళ్లీ మొదటికి..





జడ్చర్లలోని 24వ వార్డులో ఇండ్ల మధ్యే పందులను పెంచుతున్న దృశ్యం

- జడ్చర్లలో పందుల బెదడ
- 24వ వార్డులో ఇండ్ల మధ్యే పందుల పంపకం
- ఆందోళన చెందుతున్న పట్టణవాసులు

4

## బాధితులకు ఐదు లక్షల ఎల్‌ఓసి అందజేత

**ఆత్మకూర్ జూలై 13, ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సింగిల్ విండో డైరెక్టర్ తండ్రి అనారోగ్యానికి గురికావడంతో మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు రాష్ట్ర పాడి పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి 5 లక్షల రూపాయల ఎల్‌ఓసి అందజేసినట్లుగా ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ మాజీ అధ్యక్షులు రహమతుల్లా మక్తల్ నియోజకవర్గం మాజీ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ ఆత్మకూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు తదితరులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం రోజు మండలంలోని గుంటుపల్లి గ్రామంలో బాధిత కుటుంబానికి సందర్శించి చెక్కును వారి పరామర్శించారు. పేదవాడు ఆసుపత్రి వైద్యమందక అవస్థ పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్రమత్స్య శాఖ మంత్రివర్యులు తక్షణమే స్పందించి ఆరోగ్య నిమిత్తం వైద్య ఖర్చులకోసం ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా మాట్లాడి ఐదు లక్షల రూపాయల ఎల్‌ఓసిని చికిత్స నిమిత్తం అందజేసేందుకు ఆదేశాలు జారీ చేశారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాజన్న, రేవింతల యాదయ్య, తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎల్‌ఓసి పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## బీజెపి దిమ్మెను ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి

నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు

**వంగూరు, జూలై 13 ప్రభాతవార్త:** చారకొండ మండలం చంద్రాయన్‌పల్లి గ్రామంలో భారతీయ జనతా పార్టీ దిమ్మెకు ఉన్నటువంటి జెండా పైపును కొంతమంది దుండగులు ధ్వంసం చేసిన విషయాన్ని తెలుసుకున్న బిజెపి నాయకులు నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ధ్వంసం చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఆదివారం బిజెపి నాయకులు దిమ్మె వద్దకు చేరుకొని పరిశీలించి చారకొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజాస్వామ్యంలో పార్టీ జెండాలను ధ్వంసం చేయడం విరుద్ధమని, ఇలాంటి దాడులకు పాల్పడిన దుండగులను గుర్తించి అరెస్టు చేసి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చారగొండ మండల అధ్యక్షులు చెలమోని కృష్ణ, వెంకట్‌గౌడ్, కన్నా, చంద్రారెడ్డి, శ్రీను, గోళి రాజు, నోముల శంకర్ గౌడ్, రాము యాదవ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

## శ్రీశ్రీశ్రీ గెల్వలాంబ మాత బ్రహ్మోత్సవ సమావేశం

**వంగూరు, జూలై 13 ప్రభాతవార్త:** వంగూరు మండల కేంద్రంలోని శ్రీ శ్రీ గెల్వలాంబ మాత బ్రహ్మోత్సవాలు ఆగస్టు 13వ తేదీ నుండి 17 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ చైర్మన్ నకినమోని శేఖర్ ముదిరాజ్, గ్రామ పెద్దల సమక్షంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. గత సంవత్సరంలో నిర్వహించిన గెల్వలాంబ మాత బ్రహ్మోత్సవాల ముగింపు నుండి నేటి వరకు హుండీ లెక్కింపు, టికెట్లు, కొబ్బరికాయ, లడ్డు వేలంను నిర్వహించారు. ఈ సంవత్సరం అమ్మవారి హుండీ ఆదాయం రూ.81,500వేలు, టికెట్ల వేలంలో భాషమోని కృష్ణ రూ.1,71 లక్షలకు కైవసం చేసుకున్నారు. అదేవిధంగా కొబ్బరికాయల వేలం రూ.66 వేలకు, లడ్డు విక్రయాన్ని రూ.30500 లకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ నిర్వహించనున్న అమ్మవారి బ్రహ్మోత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి గ్రామ పెద్దల సహకారంతో ముందుకెళ్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జువ్వ కృష్ణయ్య, మేడిశెట్టి సురేష్, రమేష్ గౌడ్, నరేందర్ గౌడ్, డిండి బాలస్వామి గౌడ్, హరినాథ్, విష్ణుమూర్తి, కర్నాటి గెల్వయ్య, మల్లేష్, మురళి, యాదగిరి, బాలు, ప్రకాష్, శ్రీశైలం, చక్రవర్తి, డాక్టర్ రవీంద్రచారి, సిల్వేరు సైదులు, రాఘవేందర్‌గౌడ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

## చండీ, కుబేర పాశుపత యాగానికి కె. రాజ్ కుమార్‌రెడ్డికి ఆహ్వానం

**నారాయణపేట టౌన్, జూలై 13 ప్రభాతవార్త :** ధూప, దీప, నైవేద్యం అర్చక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు హైదరాబాద్ కాచిగూడలోని తుల్జాభవన్ ధర్మశాలలో నిర్వహించ తలపెట్టిన చండీ, కుబేర పాశుపత యాగానికి హాజరు కావాలని కోరుతూ ధూప, దీప, నైవేద్యం అర్చక సంఘం నారాయణపేట జిల్లా అధ్యక్షులు మడపతి జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు ఆదివారం నారాయణపేటలో భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా.కె.రాజ్ కుమార్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ధూప, దీప, నైవేద్యం అర్చక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే యాగానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండ సురేఖ, శ్రీధర్ బాబు, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ యాగానికి నారాయణపేట జిల్లా నుండి వేలాది మంది అర్చకులు హాజరవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్ రెడ్డి, గోపాల్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, హన్మంతు ముదిరాజ్, వై.సంతోష్, శివరాజ్, నర్సింహనాయుడు, ఎం.సంతోష్, నర్సింహ, నాగురావు, అశోక్, కృష్ణ యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



రాజ్‌కుమార్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న దృశ్యం

## బోరు మోటారుకు ఆర్థిక సహాయం

**దామరగిద్ద, జూలై 13 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం ముస్తాపేట గ్రామంలో త్రాగే నీళ్ల బోర్ మోటారు రిపేర్ వచ్చి పాడైపోవడంతో అది మరమ్మత్తు అయ్యే అవకాశం లేనందున దాదాపు నెల రోజులుగా గ్రామ ప్రజలు అవస్థలు పడుతూ వ్యవసాయ బోర్ల దగ్గర నీళ్లు తెచ్చుకొనే పరిస్థితి ఏర్పడింది. ప్రజల ఇబ్బందుల్ని ఫోన్ ద్వారా ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ అంజిలయ్య గౌడ్ భీష్మరాజ్ పౌండేషన్ ఛైర్మెన్ రాజ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన రాజ్‌కుమార్ రెడ్డి ఆ గ్రామ వాసులు అంజిలయ్య గౌడ్, సిద్దప్ప, లాలప్పలకు తన కార్యాలయానికి పిలిచి పదిహేను వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామ వాసులు రాజ్ కుమార్ రెడ్డికి పౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## తీన్మార్ మల్లన్నపై దాడిని ఖండిస్తున్నాం

**చిన్నంబావి, జూలై 13 ప్రభాతవార్త :** జర్నలిస్ట్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడి చేసినటువంటి వ్యక్తులు ఎంతటి వారైనా ప్రభుత్వం వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కొల్లాపూర్ నియోజకవర్గ 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు మధుగం కాశన్న యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బీసీ ఉద్యమంను అగ్రవర్ణ రాజకీయ నాయకులు అణచివేయాలని చూస్తున్నారని అందులో భాగంగానే మల్లన్న పై దాడులు చేయడం జరుగుతుందని అన్నారు. దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేని ఎడల ప్రతి నియోజకవర్గంలో నిరసన కార్యక్రమాలు చేస్తామని తెలియచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దుండగులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దూరు నాగరాజు యాదవ్, దేగ శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

## పదేండ్లు విద్యా వ్యవస్థ విధ్వంసం

# ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోలే

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 13 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పది సంవత్సరాలుగా విద్యావ్యవస్థ పూర్తిగా ధ్వంసం అయిందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. డైట్ కళాశాల విశ్రాంత అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం ప్రభుత్వ బిఇడి కళాశాల ప్రాంగణంలో జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రభుత్వ పాఠశాలలను గత ప్రభుత్వం విస్మరించి కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని ఆయన మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి విద్యా సంవత్సరం 9 వేల అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన చేశామని ఆయన గుర్తు చేశారు. ఇంకో తరం కష్టపడితే కానీ గత పది సంవత్సరాల కాలంలో జరిగిన నష్టాన్ని పూడ్చలేని స్థితికి కల్వకుంట్ల కుటుంబమే కారణమని ఆయన అన్నారు. సంవత్సరానికి 72 వేల కోట్ల రూపాయలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

కేవలం మిత్తులకే కడుతున్నామని , లక్షకోట్ల రూపాయలను కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా బూడిదలో పోసిన పన్నీరు చేశారని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను సరిదిద్దేందుకు భగీరథ ప్రయత్నమే చేస్తున్నామన్నారు. మహబూబ్‌నగర్ నుంచి ఎంపిగా గెలిపించుకుని, తొలి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేస్తే, మహబూబ్‌నగర్‌కు తీరని నష్టం చేశారని ఆరోపించారు. రూ. 8000 కోట్ల బకాయిలు గత బిఆర్ఎస్ ప్రభుత్వం మీకు చెల్లించలేదని, ఇప్పుడేమో పోరాటం చేస్తామంటున్నారని ఎద్దేవా చేశారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క వర్గానికి అందిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. అందరం కలిసి దుర్మార్గమైన పాలనను అంత మొందించామన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ప్రతి నియోజకవర్గానికి రెండు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. మీరు ఇచ్చే సలహాలు సూచనలు స్వీకరిస్తామని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్‌లో విద్యాభివృద్ధికి ఏఏ కార్యక్రమాలు చేస్తే బాగుంటుంది అని నివేదిక ఇస్తే మీరు ఇచ్చే నివేదికను ముఖ్యమంత్రి గారికి అందించి అమలు చేయడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.జగపతి రావు, ఎస్.విజయ్ కుమార్, ప్రతాప్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్ హయాంలో గాడిలో పెట్టేందుకు భగీరథ ప్రయత్నం : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**డైట్ కళాశాల విశ్రాంత అధ్యాపకులతో ఆత్మీయ సమ్మేళనం**

## బీసీ కులాల రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలి

**చిన్న చింతకుంట, జూలై 13 ప్రభాతవార్త :** బిసి కులాల 42 శాతం రిజర్వేషన్ కు చట్టబద్ధత కల్పించాలని బీసీ కులాల ఐక్యవేదిక కన్వీనర్ గౌనికాడి రాములు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కులగణన ప్రక్రియ పూర్తి చేయడంతో పాటు జనాభా దామాషా ప్రకారం బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగంలో రిజర్వేషన్లు పెంచే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. జన గణనతో పాటు కుల గణన చేపట్టినంత మాత్రాన బీసీలకు రిజర్వేషన్లు దక్కవని, అందుకు అనుగుణంగా కేంద్రం నిర్ణయం తీసుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు అఖిలపక్ష పార్టీలు, బీసీ ఉద్యమ నేతలను ప్రధాని మోదీ వద్దకు తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కుల గణన నిర్ణయంతో తాము పాక్షిక విజయం సాధించామని విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచినప్పుడే బీసీ ఉద్యమానికి సంపూర్ణ విజయం సాధించినట్లు అవుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత ఉద్యమానికి మద్దతుగా ఈ నెల 19న కొత్తకోట పట్టణ కేంద్రంలో దేవరకద్ర నియోజకవర్గం స్థాయిలో బీసీ కులాల భవిష్యత్తు, కార్యాచరణ పై బీసీ నేతలు, ప్రజా ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు నంబిరాజు, వివిధ కుల సంఘాల నేతలు మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ గౌడ్ , బాల చంద్రుడు పద్మశాలి, మంగలి మనోహర్, మహేష్ వాల్మీకిలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాములు యాదవ్

## న్యూస్ కార్యాలయంపై దాడి చేయడం అమానుషం

అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి

**నారాయణపేట టౌన్, జులై 13 ప్రభాతవార్త :** హైదరాబాద్ మేడిపల్లిలో గల ఓ న్యూస్ కార్యాలయంపై బిఆర్ఎస్ పార్టీ, జాగృతి దాడిని తీవ్రంగా ఖండిస్తూ అనాగరికమైన, అమానవీయమైన దాడి అన్నారు. టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవితపై ఆ న్యూస్ అధినేత ఎమ్మెల్సీ నిన్న జహీరాబాద్‌పర్యటనలో భాగంగా అనుచితవ్యాఖ్యలు చేశాడన్న ఆరోపణపై టిఆర్ఎస్,జాగృతి కార్యకర్తలను ఉసిగొలిపి భౌతికంగా ఈ దాడి చేయించడం హేయమైన చర్య అన్నారు. చేసిన వ్యాఖ్యలపై నిరసనలు, కేసులు గాని చేసుకోవచ్చును కానీ ఇలా ఆఫీసులపై, జర్నలిస్టులపై భౌతికంగా దాడులు చేసే సంస్కృతి మంచిది కాదన్నారు.ఆఫీసును,ఆఫీసులో ఉన్న ఫర్నిచర్‌ని ధ్వంసం చేస్తూ అంగరక్షకులపై కూడ దాడి చేస్తే వారు ఆత్మరక్షణలోభాగంగా అంగరక్షకులు గాల్లోకి ఐదురౌండ్లు కాల్పులు జరిపేటంత భయత్పాదం సృష్టించడం సరికాదన్నారు. దేశంలో, రాష్ట్రంలో ఎక్కడైనా ప్రజాస్వామిక వాతావరంలో విమర్శించే హక్కు ఉంటుంది. కానీ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న రాజకీయ నాయకులను వారి పరిపాలన విధానాలను ప్రశ్నించినా, కులోన్మాదన్ని, మత ఉన్మాదాన్ని సమాజంలో రెచ్చగొడుతు ప్రజల మధ్య చిచ్చులు పెడుతున్న వారిని విమర్శించిన, ఏలెత్తి చూపిన ఈ మధ్యలో భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తూ ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియాలపైనె కాకుండా ఒక రకంగా భావ ప్రకటన చేసే సంస్థలపై, వ్యక్తులపై భౌతిక దాడులు చేయడం అనేది ఆనవాయితీగా వస్తున్నది. ఈ దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, దీనిని ప్రజలు ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలన్నారు.

## ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి : ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు

**నారాయణపేట టౌన్, జూలై 13 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు తెలిపారు. ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఓల్డ్ బస్టాండ్ వద్ద ప్రజలకు రోడ్డు భద్రత నియమాల పై, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వివిధ గ్రామాల నుండి సంతకు వచ్చే సమయంలో ఇంట్లో ఒకరు తప్పకుండా ఉండేలా చూసుకోవాలని లేని ఎడల బంగారు విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో దాచుకోవాలని సూచించారు. షాపింగుకు , బ్యాంక్‌కు వచ్చే సమయంలో అప్రమత్తంగా ఉంటూ తమ విలువైన వస్తువులను డబ్బులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు అనేక రూపాలలో ప్రజలను మోసం చేస్తున్నారని ముఖ్యంగా బ్యాంక్ ఖాతాల వివరాలు ఓటీపీలు, ఆధార్, పాన్ వంటి వ్యక్తిగత సమాచారం పొంది ఖాతాలో డబ్బులు కాజేస్తున్నారు సోషల్ మీడియా ఫోన్ కాల్స్, ఫేక్ లింక్స్ ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఒకవేళ సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ , ఇమానియల్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు హర్షణీయం

**ఉప్పునుంతల, జూలై 13 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు హర్షణీయమని, కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని బీసీ వర్గాలు వెల్లడించారు. ఆదివారం మండల కేంద్రమైన ఉప్పునుంతల పోచమ్మ చౌరస్తాలో బీసీ సెల్ మండల నాయకులు మడ్డీ తిరుపతయ్య గౌడ్ ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి కులగనన చేపట్టి రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు, బీసీ సెల్ మండల నాయకులు పెబ్బేటి నిరంజన్, బీసీసెల్ మండల అధ్యక్షుడు మడ్డి తిరుపతయ్యగౌడ్, తాడూరు మాజీ సర్పంచ్ చంద్రయ్య గౌడ్, తిరుపతయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు లతీపూర్ గ్రామానికి చెందిన దొడ్ల నరేష్ యాదవ్, యూత్ కాంగ్రెస్ ఇంఛార్జి అంతటి శేఖర్ గౌడ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మేడమోని భాస్కర్, శేఖర్, ఈరట్వాన్‌పల్లి మాజీ సర్పంచ్ లింగమయ్య యాదవ్ తదితర కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, బిసి అభిమానులు పాల్గొన్నారు.



ఉప్పునుంతల పోచమ్మ చౌరస్తాలో సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బిసి శ్రేణులు

## ఆదిత్యను పరామర్శించిన ఎంపీ డీకే అరుణ

**రాజాపూర్, జూలై 13 ప్రభాతవార్త :** బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్, రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన ఆదిత్య మాతృమూర్తి బోడ జానంపేట్ నర్సమ్మ గతవారం రోజుల క్రితం మరణించిన విషయం విధితమే. ఆదివారం మండల కేంద్రంలోని వారి స్వగృహంలో నర్సమ్మ చిత్రపటానికి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ ఆదిత్యను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎంపీ డీకే అరుణ వెంట పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



ఆదిత్యను పరామర్శించిన ఎంపి డికె అరుణ

## యువజన కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



యువజన కాంగ్రెస్ గ్రామ కమిటీని సన్మానిస్తున్న దృశ్యం

**బిజినేపల్లి, జూలై13 ప్రభాతవార్త:** యువజన కాంగ్రెస్ మండల అధ్య క్షుడు ఎద్దుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో పాలెం గ్రామంలో యువజన కాంగ్రెస్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షు డిగా కసిరెడ్డి భరత్‌రెడ్డి,ఉపాధ్యక్షులుగా వేపురి సిద్దార్థలను ఎన్ను కున్నారు.ఈకార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు తిరుపతి గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్ గౌడ్,సీనియర్ నా యకులు గోవిందు రామకృష్ణ ,జయకృష్ణ గౌడ్, విశ్వనాథ్, చంద్ర శేఖర్, విష్ణు, అబ్దు, బాలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ మల్లురవికి శుభాకాంక్షలు తెలిపిన కత్తెర కృష్ణయ్యయాదవ్



ఎంపి మల్లురవికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

**రాజాపూర్, జూలై 13 ప్రభాతవార్త :** నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవికి ఒకరోజు ముందుగానే పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తెర కృష్ణయ్య యాదవ్ ఆదివారం హైదరాబాదులోని తన నివాసంలో కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినట్లు కృష్ణయ్య యాదవ్ తెలిపారు.మల్లురవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఎస్టి సెల్ మండల అధ్యక్షులు గోపీనాథ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాములు, బుగ్గయ్య, చిన్న తదితరులు ఉన్నారు.

## క్రీడా అకాడమీలో ప్రవేశాలకు, ఎంపికలు

**నారాయణపేట ప్రతినిధి, జూలై 13 ప్రభాతవార్త:** రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలి ఎల్బీ స్టేడియంలో నూ తనంగా ఏర్పాటుచేసిన క్రీడా అకాడమీలో 202526 విద్యా సం వత్సరం బాలబాలికలకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఇంచార్జ్ డీవైఎ స్ఓ సాయినాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ , ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో ప్రవేశాలు ఈ నెల 15,16 తేదీల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొ న్నారు. ఆసక్తిగల జిల్లా లోని క్రీడాకారులు, విద్యార్థులు విద్యా ర్హత, జనన, క్రీడా ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, 10 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం 7 గం.లకు ఎల్బీ స్టేడియానికి చేరుకోవాలని సూచించారు.

## కొల్లూరు గ్రామ పరిధిలో కుక్కల దాడిలో 25 గొర్రెలు మృతి

**ఊట్కూర్, జూలై 13 ప్రభాతవార్త :** ఓ కుక్క 25 గొర్రెలను చంపిన ఘటన నారాయణపేట జిల్లా కొల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం గొర్రెల యజమానులు ఓ కంచె ఏర్పాటు చేసి అందులో వాటిని వదిలి వెళ్లారు. కంచెలోకి ప్రవేశించిన కుక్క గొర్రెలపై దాడి చేసి చంపేసింది. యజమానులు సాయంత్రం వచ్చి చూడగా అప్పటికే 25 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మిగతా 23 గొర్రెలు ప్రాణాలతో బయటపడ్డాయి. దాదాపు రూ.1.6లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు యజమానులు తెలిపారు.

## నిబంధనలు పాటించని మటన్ షాపు యజమానులు

**నారాయణపేట, జూలై 13 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణ కేంద్రంలోని మటన్ మార్కెట్‌లో నిబంధనలకు విరుద్ధంగా నాలుగు కిలోలు మూడు కిలోల గొర్రె పిల్లలు మేక పిల్లలను విక్రయిస్తున్నారని నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న వారిపై అధికారులు చూసి చూడనట్లు స్పందించకపోవడం విడ్డూరమని అధికారులు స్పందించి నిబంధనలను పాటించే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని జంతు ప్రియులు ఆవేదన వ్యక్తం చేశారు.

## నేడు సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహావిష్కరణ

విగ్రహదాత మాజీ ఎంపీపీ నర్సింలు

**రాజాపూర్, జూలై 13 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహ ఆవిష్కరణ సోమవారం ఉదయం 10 గం.లకు జరగనుందని ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి పార్టీలకతీతంగా నాయకులు,కార్యకర్తలు,యువకులు పాల్గొనాలని విగ్రహ దాత, మాజీఎంపీపీ అన్మగల్ల నర్సింలు కోరారు. అధ్యాపకుడి నుండి భారత రాష్ట్రపతిగా ఉన్నత శిఖరాలు అధిరోహించి ఉపాధ్యాయలోకానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈసందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సర్వేపల్లి విగ్రహదాత మాజీ ఎంపీపీ నర్సింలు

## బిసి రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలి

**మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ**

**నారాయణపేట టౌన్,జూలై 13 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బిసి రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలని నారాయణపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వైఖరి చూస్తుంటే మళ్ళీ బిసి లని మోసం చేసే కుట్రగా స్పష్టమవుతున్నదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుపై రాష్ట్ర ప్రభుత్వం లోనే స్పష్టతని అన్నారు. ఆర్డినెన్సు ఎప్పుడు తీస్తారో చెప్పకుండానే రిజర్వేషన్లు అమలుఅయ్యాయని సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బిసి రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలన్నారు. బిసి రిజర్వేషన్లకు బిజెపి సంపూర్ణ మద్దతు ఉందని స్పష్టత ఇవ్వాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను తొక్కి పెట్టడానికే కాంగ్రెస్ జిమ్మిక్కులు చేస్తున్నదని విమర్శించారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**నారాయణపేట ప్రతినిధి, జూలై 13 ప్రభాతవార్త:** నారాయణపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభ్యసించిన ఇంటర్ 2008-2010 బ్యాచ్ విద్యార్థులు 15 సంవత్సరాల తర్వాత మాధ్యమిక విద్య పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం లక్ష్మి బాంకెట్స్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించడం జరిగింది. తమ గురువులను పూలతో ఆహ్వానించి స్వాగతం పలకడం జరిగింది. వందమంది విద్యార్థులతో జ్ఞాపకాలని అనుభవాలను స్మృతులను గుర్తు చేసుకుంటూ ఎంత ఉత్సాహంతో ఆనందంతో రకరకాల అభిరుచులను పంచుకుంటూ ఎంతో ఆప్యాయంగా మృదువుగా సామాజిక స్పృహ తోటి ఆర్థిక అసమానతలను తొలగించే విధంగా భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలిచే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరిగింది. ఈ సమావేశానికి ఆనాటి ఉపాధ్యాయులు వసంత, శ్రీలత, శోభారాణి, సతీష్ రెడ్డి, నరసింహారెడ్డి, సత్యనారాయణ హాజరు కావడం జరిగింది. జీవితంలో ఎదుర్కొనే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రేరణ కల్పించిన ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

## మున్సిపల్ వర్కర్ల నూతన అధ్యక్షుడిగా ఎండి అయూబ్

**పెబ్బేరు, జూలై 13 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీ మణికంఠ మునిసిపల్ అసోసియేషన్ వర్కర్లు అందరూ కలిసి ఏకగ్రీవంగా నూతన మున్సిపల్ కార్యవర్గంను ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షునిగా ఎండి అయూబ్, మణికంఠ మున్సిపాలిటీ వర్కర్ల సంఘం నియమించింది. గౌరవ అధ్యక్షులు భగవత్, ఉపాధ్యక్షులుగా జి.బక్కన్న, జి.బాలయ్య. ప్రధాన కార్యదర్శిలుగా గంగన్న, కోశాధికారి రాజు,మీడియా కన్వీనర్ దిలీప్, ప్రచార కార్యదర్శిలు డి.కృష్ణ, శేఖర్, జయశ్రీ, సహాయ కార్యదర్శులు జి రంజిత్, కుమార్, భాస్కర్, ఈశ్వర్, ఈశ్వరమ్మ, కమిటీ సభ్యులుగా నాగరారాజు, రాముడు (జంగిడి), కృష్ణ,కురుమూర్తి,తిరుపతి, లక్ష్మి, భాగ్యమ్మ, రాజశేఖర్, పెంటమ్మ, చిన్న మనెమ్మ, సంజయ్,హరిప్రసాద్, నాగమ్మ, గౌరవ సలహాదారులు గంధం రాములు, సిద్ధిరంజిత్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. అయూబ్ మాట్లాడుతూ అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు మణికంఠ మున్సిపల్ వర్కర్ల అసోసియేషన్ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ కార్మికుల కోసం పనిచేస్తానని, ఎల్లప్పుడూ ఏ ఆపద వచ్చినా ముందుండి చేస్తానని తెలిపారు.



నూతనంగా ఏర్పాటైన మున్సిపల్ కార్యవర్గం

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

**మద్దూర్, జూలై 13 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి, బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల్లో కల్పించినందుకు ఆదివారం నారాయణపేట జిల్లా మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలో రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని పురవీధుల గుండా తిరుగుతూ అంబేద్కర్‌కు పూలమాల రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి, బాణాసంచాలు కాల్చి బీసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగిరెడ్డి పల్లెబాలయ్య, గూళ్ళ రవి, మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి చరితాత్మక నిర్ణయం అన్నారు. ఈ కార్యక్రమంలో బర్ల మల్లికార్జున్, నిడ్జింత చందు, గణప రవి, రేణివట్ల గోవిందు, ప్రకాష్, హుస్సేన్, వడ్ల సాయిలు, యాసిన్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేసిన నాయకులు

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ చెక్కు అందజేత

**వెల్దండ, జూలై 13 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని పెద్దాపూర్ గ్రామ పంచాయతీకి చెందిన మాడ్గుల రంగయ్య సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.32వేల చెక్కును ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు కల్వకుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్య ప్రదాయని సీఎం రిలీఫ్ ఫండ్ అని, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడ్డేటి లక్ష్మారెడ్డి, నెంట శ్రీను, తిరుపతినాయక్, కాటిక రాములు, బాలయ్య, కృష్ణయ్య, మాధవులు, విజేందర్‌రెడ్డి, ప్రవీణ్ నాయక్, సుధాకర్, అనిల్, అజార్, తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న దృశ్యం

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నారాయణపేట టౌన్, జూలై, 13 ప్రభాత వార్త :** నారాయణపేట పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో 1999,2020 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సరస్వతి శిశు మందిర్‌లో చదివి 25 సంవత్సరాల తర్వాత నాటి స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని చిన్ననాటి స్మృతులను, జ్ఞాపకాలను, మధురానుభవాలను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యా బుద్ధులు నేర్పిన ఆచార్య, మతాజీలను పూర్వ విద్యార్థులు ఘనంగా శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అదేవిధంగా పాఠశాలకు 50 కుర్చీలను, 50 స్టీల్ ప్లేట్లను బహూకరించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో చదివిన మాకు విద్యతో పాటుగా సంస్కారం కూడ నేర్పించిందని అన్నారు. మిత్రులందరిని కలవడంతో తిరిగి బాల్యంలోకి వెళ్లినట్లు అనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు రతంగపాండు రెడ్డి, పాలమూరు విభాగ్ కార్యదర్శి కుంటి ఎల్లప్ప, జిల్లా కార్యదర్శి దూస సీతారాములు, జిల్లా సహకార్యదర్శి పటేల్ శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రధానాచార్యులు దత్తు చౌదరి, పూర్వ విద్యార్థి పరిషత్ సభ్యులు, పూర్వ, ప్రస్తుత ఆచార్య మతాజీలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

# సినీనటుడు కోటతో పేట కున్న అనుబంధం మరువలేనిది

### కోట శ్రీనివాసరావు మృతికి విశ్వహిందూ పరిషత్ ప్రగాఢ సంతాపం

**నారాయణపేట ప్రతినిధి, జూలై 13 ప్రభాతవార్త:** సినీనటులు, హిందుత్వవాది, భారతీయ జనతా పార్టీ మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు ఆదివారం మరణించిన విషయం పట్ల విశ్వహిందూ పరిషత్ తీవ్ర విచారణ వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం విశ్వహిందూ పరిషత్ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి మాట్లాడుతూ శ్రీ రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా అయోధ్యలో భవ్యమైన అక్షింతలు కోట శ్రీనివాసరావుకి అందజేసిన క్షణాలు గుర్తు చేసుకున్నారు. ఆ సందర్భంలో విశ్వహిందూ పరిషత్ బృందానికి కోట శ్రీనివాస్ అత్యంత ఆత్మీయత కనబరిచి, ఆతిథ్యం హిందుత్వం గురించి, అయోధ్య రాముడు గురించి కోట శ్రీనివాస్ చక్కని విషయాలు తెలియజేశారని అలాగే హిందూ ధర్మం శాశ్వతంగా నిలబడాలని, అది ప్రపంచానికే ఆదర్శమని చెప్పారని అన్నారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర బృందం అప్పటి రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్, రాష్ట్ర సహకార్యదర్శి శ్రీ భాను ప్రసాద్, దుర్గా వాహిని ప్రాంత ప్రముఖ్ వాణి సక్కుబాయి, బిజెపి నాయకురాలు కరాటే కళ్యాణి తో పాటు కోట శ్రీనివాసరావుని కలిసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నో విలక్షణమైన పాత్రలలో, ఆకట్టుకునే నటనతో తెలుగుతో పాటు అనేక భారతీయ భాషలకు చెందిన ప్రేక్షకాభిమానాన్ని సంపాదించుకున్న ఆయన సహజ సిద్ధమైన హావభావాలు, పాత్రకు తగిన వాక్చాతుర్యంతో భారతీయ చలనచిత్ర సీమలో తనదైన ముద్ర వేశారు. నటునిగానే కాకుండా, భారతీయ జనతా పార్టీ నుంచి శాసనసభ్యునిగా కోట శ్రీనివాసరావు అందించిన సేవలు అమూల్యమైనవి. భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం సహా, చలనచిత్ర రంగంలో 9 నంది అవార్డులు అందుకున్న ఆయన నటనా వైదుష్యానికి తార్కాణాలు. కోట శ్రీనివాసరావు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు విశ్వహిందూ పరిషత్ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.



శ్రీరామ మందిర అక్షింతలు కోట శ్రీనివాసరావుకు అందజేస్తున్న దృశ్యం (ఫైల్)



బహుమతులు అందజేస్తున్న కోట శ్రీనివాసరావు (ఫైల్)

**నారాయణపేట టౌన్, జూలై 13 ప్రభాతవార్త :** ప్రముఖ తెలుగు చలన చిత్రనటులు కోట శ్రీనివాస్‌తో బాలు అభిమాన సంఘంకు ఉన్న అనుబంధం మరువ లేనిదని ఆయన మరణం తెలుగు చలన చిత్ర రంగానికే కాకుండా కళాకారులకే తీరని లోటని ఎస్పి బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డి అన్నారు. అప్పట్లో 2000 సంవత్సరంలో జిల్లా కేంద్రంలో బాలు అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నృత్య పాటల పోటీల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి కోటశ్రీనివాస్ రావ్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బాహుమతులను అందించారన్నారు. కోట శ్రీనివాస్ రావు ఆత్మకు భగవంతుడు శాంతిని చేకూర్చి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాధించాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## విద్య,సామజిక, ఆర్థికంగా మైనారిటీలు ఎదగాలి.సరితమ్మ

**గద్వాల టౌన్, జూలై 13, ప్రభాత వార్త:** దేశంలో మైనారిటీలు ఆర్థికంగా,సామాజికంగా, విద్యాపరంగా ఎదగాలని మాజీ జెడ్పీ చైర్మన్, గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ సరితమ్మ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని తేరుమైనంలో నిర్వ హించిన ఆవాజ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలో ఆమె మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్రంలోని నలుమూలల నుండి ఆవాజ్ కమిటీ రాష్ట్ర మహాసభ గద్వాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం ఎంతో సంతో షకరమైన విషయమన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో మైనార్టీలపై విచ్చలవిడి దాడులు జరుగుతున్నాయని, గోరక్షణ పేరుతో దాడులు వేసి హత్యలు చేస్తున్నారన్నారు . ఈ మతోన్మాద సంస్కృతి క్రమంగా తెలంగాణ రాష్ట్రంలో విస్తరిస్తున్న దని, మతోన్మాద శక్తుల విషప్ర చారం తెలంగాణ ప్రజలు మనసులను కలుషితం చేస్తుందని, మతో న్మాద శక్తులు సృష్టిస్తున్న అపోహాలు, అపార్థాలను దూరం చేయాల ని, మైనార్టీల ప్రజలకు అసత్య విద్వేష ప్రచారాలను ఎండగాడుతూ ప్రజలలో చైతన్యం కలిగించాలని, లౌకికవాదాన్ని మతసామరస్య విధానాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఆవాజ్ ఈ కృషిని పెద్ద ఎత్తున చేస్తుందని, పేదరికం నిరుద్యోగ,నిరక్షరాస్యత ఇబ్బంది పడుతున్న మైనార్టీలకు రాజ్యాంగ హక్కుల కోసం , ప్రభుత్వం నుండి రావాల్సిన సహాయ సహకారాల కోసం ఆవాజ్ పనిచేస్తుందన్నారు.




అవాజ్ బహిరంగ సభలో మాట్లాడుతున్న సరితమ్మ

## పేదవాడి కంటి చూపుకు చిరునామా...

**తెలంగాణ టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**కల్వకుర్తి, జూలై 14 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని సికేఆర్ ఫంక్షన్ హాల్‌లో గత 9 రోజులుగా ఐక్యత పౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి చికిత్స శిబిరం ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి టాస్క్ సీఈవో,ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ గతసంవత్సర కాలంగా నియోజకవర్గంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తున్నామని.మొదటగా ఏర్పాటు చేసిన కంటి శిబిరానికి వచ్చిన ప్రజల స్పందన తెలుసుకొని నియోజకవర్గం వ్యాప్తంగా ఈ కంటి శస్త్ర చికిత్స శిబిరాల అవసరం చాలా ఉందని అన్నారు.రాబోయే రోజుల్లో మండలాల వారిగా చాలా మంది నిరుపేదలు ఆర్థిక సమస్యలతో కూడా కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, వారికి పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తూ అవసరమైన వారికి ఉచిత అద్దాలు పంపిణీ చేస్తూ, నిరుపేదలకు ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్లు చేస్తూ వారికి చూపుకి భరోసానిచ్చే విధంగ ముందుకు సాగుతున్నామని అన్నారు. గత 9 రోజులుగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి చికిత్స శిబిరంలో 6 వేల మంది కంటి సమస్యలకు చూపించుకున్నారని, నిరుపేద కుటుంబాలకు చెందిన 153 మందికి విజయవంతంగా ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్లు పూర్తి పూర్తిచేసి వారి కళ్ళల్లో వెలుగులు నింపామని పేర్కొన్నారు. 4,400 వారికి ఉచిత కంటి పరీక్షల నిర్వహించామని పేర్కొన్నారు. కంటి సమస్యలు ఉన్న 3 వేల మందికి ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, నరేందర్ గౌడ్, యూసుఫ్, గణేష్, రఘు, యాదయ్య, కొండల్, శేఖర్, రమేష్ నాయక్, శ్రీపతి, రాఘవేందర్, నాగిళ్ల శివ, శ్రీను, కళ్యాణ్, మల్లేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహించుకున్న వారితో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

## మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి శూన్యం

**మార్కెట్ కమిటీ చైర్మన్ వావిళ్ళ మనీలా సంజీవ్ కుమార్ యాదవ్**

**కల్వకుర్తి, జూలై 13 ప్రభాతవార్త:** గత పదేళ్లలో జరిగని అభివృద్ధి.. నియోజకవర్గంలో పరుగులు పెడుతుంటే... తన రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతుందని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ జీర్ణించుకోలేకపోతున్నారని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వావిళ్ళ మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న జైపాల్ యాదవ్ తాను సొంతంగా ఆస్తులు సంపాదించుకున్నాడు తప్ప కల్వకుర్తికి ఏ ఒక్క అభివృద్ధి పని చేయలేదని దుయ్యబట్టారు. ఆదివారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వావిళ్ళ మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ గత పదేళ్లుగా అభివృద్ధికి నోచుకొని కల్వకుర్తిని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తుంటే మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఓర్చుకోవడం లేదన్నారు. అచ్చంపేట, నాగర్‌కర్నూల్‌లో 100 పడకల ఆసుపత్రులు ప్రారంభమైతే కల్వకుర్తిలో ఎందుకు ప్రారంభం చేయలేదని ఆమె ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని కడ్తాలలో రెండు క్రషర్లు, కొల్లాపూర్‌లో 600 ఎకరాల భూమి సంపాదించుకున్నారు తప్ప నియోజకవర్గానికి చేసింది శూన్యమన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని ఆమె హెచ్చరించారు. ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి జైపాల్ యాదవ్ కు లేదని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ పండిత్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రమాకాంత్ రెడ్డి కొండల్, ముజ్జు, భీమ్లా, కృష్ణయ్య, దాచేపల్లి శ్రీనివాస్ తదితరులున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ వావిళ్ళ మనీలా సంజీవ్ కుమార్ యాదవ్

## తీన్మార్ మల్లన్నపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

**మూసాపేట, జూలై 13 ప్రభాతవార్త :** ఆదివారము హైదరాబాదులోనే తీన్మార్ మల్లన్న న్యూస్ ఆఫీస్‌పై తెలంగాణ జాగృతి గుండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మూసాపేట మండలం పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు నల్ల తిరుపతయ్య గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ జాగృతి గుండాలను అరెస్టు చేయాలని ఈ దాడికి కారకురాలైన ఎమ్మెల్సీ కవితను వెంటనే అరెస్టు చేసి ఎమ్మెల్సీ పదవి నుండి కవితను బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల గొంతుకై బహుజన ఆశాదీపం బీసీ బహుజనులకు జరుగుతున్న అన్యాయాన్ని లెక్కలతో సహా ఎండగడుతున్న తీన్మార్ మల్లన్నపై సహించలేకనే తెలంగాణ జాగృతి నేత ఎమ్మెల్సీ కవిత దాడి చేయించిందని ఈ దాడిని అగ్రకులాలు బీసీలపై చేసిన దాడిని గుర్తిస్తున్నామని వెంటనే ఎమ్మెల్సీ కవిత తీన్మార్ మల్లన్నకు క్షమాపణ చెప్పి మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరిస్తున్నట్లు ఆయన తెలిపారు. బీసీలు శాంతియుతంగా జనాభా దామాషా ప్రకారం 42 శాతం శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్‌తో తీన్మార్ మల్లన్న ఉద్యమిస్తుంటే తీన్మార్ మల్లన్న అణిచివేతకు భౌతికంగా దాడి చేయడం హింసాత్మక చర్యలకు పూనుకోవడం ప్రజాస్వామ్య విధానానికి విరుద్ధం. తెలంగాణ ప్రభుత్వం తక్షణమే ఎమ్మెల్సీ కవితపై చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని బిసి పొలిటికల్ జెసి తరఫున తాము డిమాండ్ చేస్తున్నట్లు ఆయన ఓ ప్రకటన తెలిపారు.



తిరుపతయ్య గౌడ్

## గణపతి దేవాలయ నిర్మాణానికి స్థలం పరిశీలించిన రాజకుమార్ రెడ్డి

**నారాయణపేట టౌన్, జూలై 13 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని వల్లంపల్లి రోడ్డులో సమీపంలోని శబరి పీఠం దేవాలయ ఆవరణలో భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కె.రాజ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గణపతి దేవాలయం నిర్మాణానికి సంబంధించిన కొలతలను దేవాలయ నిర్వాహకులు, గురుస్వాములు స్థలంతో పాటు కొలతలు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు గురుస్వాములు మాట్లాడుతూ భీష్మ రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణపతి దేవాలయ నిర్మాణానికి గురుస్వాములు, భక్తులతో కలిసి శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. శబరి పీఠం ప్రాంగణంలో గణపతి ఆలయాన్ని నిర్మించాలని జనవరి మాసంలో రాజ్ కుమార్ రెడ్డిని కలిసి విన్నవించడం జరిగిందని, కోరిన వెంటనే గణపతి దేవాలయ నిర్మాణానికి ఒప్పుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు కాకర్ల భీమయ్య, అప్పి, జంగిటి వెంకటేష్, బాబు, తిప్పన్న, కృష్ణ, బాలు, ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్ రెడ్డి, గోపాల్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, హన్మంతు ముదిరాజ్, వై.సంతోష్, శివరాజ్, నర్సింహనాయుడు, ఎం.సంతోష్, నర్సింహ, నాగురావు, అశోక్, కృష్ణ యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



దేవాలయ నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న రాజ్‌కుమార్‌రెడ్డి

## సంత ప్రజల ఆకలి తీరుస్తున్న జెకె ట్రస్ట్



సంతకు వచ్చే ప్రజలకు అన్నం పెడుతున్న ట్రస్టు సభ్యులు

**నవాబుపేట,జూలై 13 ప్రభాతవార్త :** ఆదివారం సంతకు వచ్చే ప్రజల ఆకలి దాహం తీరుస్తున్న జెకె ట్రస్ట్ ను చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అభినందిస్తున్నారు. ఆదివారం నవాబుపేట మండల కేంద్రంలో జెకె ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 45వ వారం ఉచిత భోజన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. మధ్యాహ్న భోజనాన్ని సంతకు వచ్చే ప్రజల ఆకలిని తీరుస్తూ ప్రజల ఆశీస్సులు పొందుతున్నారు. జెకె ట్రస్ట్ ఫ్యామిలీ మెంబర్స్, ట్రస్ట్ మెంబర్స్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం మధ్యాహ్నం భోజనం కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

## నూతన వాల్మీకి కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

**చిన్నంబావి, జూలై 13 ప్రభాతవార్త :** చిన్నంబావి మండల వాల్మీకి నూతన కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. నూతన మండల అధ్యక్షుడిగా ఉమేష్ నాయుడుని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షుడిగా సత్యం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా యాదగిరిని ఎన్నుకోవడం జరిగింది. అనంతరం నూతన వాల్మీకి మండల అధ్యక్షుడు ఉమేష్‌ని వాల్మీకి కమిటీ సభ్యులు సన్మానించడం జరిగింది. ఈకార్యక్రమంలో వాల్మీకి మండల మాజీ అధ్యక్షులు,మండల వాల్మీకి నాయకులు, కమిటీ సభ్యులు, వాల్మీకి సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ పునర్ నిర్మాణానికి విరాళం



దేవాలయ పునర్ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ,జూలై13 ప్రభాతవార్త:** మండలంలోని చెర్కూర్ గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ శివాలయ ఆంజనేయస్వామి దేవాలయ పునర్ నిర్మాణానికి గ్రామానికి చెందిన దేవరశెట్టి విశ్వనాథం రూ.1లక్ష విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. దేవా లయ నిర్మాణాన్ని నాణ్యతగా త్వరగా నిర్మించి భక్తులకు అందు బాటులోకి తీసుకురావాల్సిందిగా నిర్వాహకులకు దాతలు పేర్కొ న్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు గోవర్ధన్ రెడ్డి, గౌరీ శంకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సందీప్, శశిధర్, రామచంద్రయ్య, రమేష్, లాలయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ ప్రమాదంతో అంధ బాలిక సజీవ దగ్ధం

**మక్తల్ టౌన్, జూలై 13 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలోని నందిని నగర్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మక్తల్ పట్టణంలో నందినినగర్‌లో నివాసముంటున్న భానుప్రియ (13) దివ్యాంగ బాలిక పుట్టుకతోనే అందురాలు వాటర్ హీటర్ షార్ట్ సర్క్యూట్ సంభవించిన విషయం గమనించక ఇంట్లోనే ఉండిపోవడంతో అక్కడికక్కడే సజీవ దహనం అయింది. బయటికి రావడానికి కళ్ళు కనిపించని అంధబాలిక ప్రమాదం సంభవించిన విషయం తెలియక ఇంట్లోనే ఉండి పోవడంతో మరణానికి కారణమైందని స్థానికులు చెబుతున్నారు. షార్ట్ సర్క్యూట్ వాటర్ హీటర్ పెట్టి మరిచి అలాగే ఎక్కువసేపు వదిలి వేయడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగిందని స్థానికులు తెలిపారు.



సజీవ దహనమైన అంధ బాలిక

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుంది

**యాసంగి వరి బోనస్‌ను రైతుల ఖాతాలో తక్షణమే జమ చేయాలి**

**ఉమ్మడి మండల బిజెపి అధ్యక్షుడు నల్లె నరసప్ప**

**కృష్ణ, జూలై 13 ప్రభాతవార్త:** ప్రభుత్వం యాసంగి సీజన్‌కు సంబంధించి వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి మూడు నెలలు గడిచినా ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ చేయలేదని, తక్షణమే రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ చేయాలని బీజేపీ ఉమ్మడి మండల అధ్యక్షులు నల్లే నర్సప్ప డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని గప్పాలు చెప్పుకొనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా 50 శాతం కూడ రైతు రుణమాఫీ చేయలేదన్నారు. అదేవిదంగా మూడు విడతల రైతుబంధు ఎగొట్టి ఇప్పుడు రైతు బంధు వేయడం చూస్తుంటే స్థానిక సంస్థల ఎన్నికల స్టంట్‌లో భాగంగా కంటి తుడుపు చర్యలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వానికి ముందు చూపు ఆలోచన లేకుండా వ్యవసాయానికి సరిపడా యూరియా అందుబాటులో ఉంచకుండా యూరియా కొరతను సృష్టించి ఉమ్మడి రాష్ట్రంలోని రోజులను గుర్తు చేస్తుందన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా త్వరతగతిన ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యాసంగి వరికి బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ చేయాలని, ఎలాంటి ఆంక్షలు లేకుండా మిగిలి పోయిన రైతుల రూ. 2లక్షల రుణ మాఫీ చేసి, రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలన్నారు. లేని యెడల బీజేపీ ఉమ్మడి మండల శాఖ తరపున రైతులకు న్యాయం జరిగే వరకూ రైతులతో కలిసి ప్రభుత్వంపై ఉద్యమిస్తామన్నారు.

## ప్రతి ఒక్కరూ ధ్యాన్యం చేయాలి

**ధన్వాడ, జూలై 13 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలో శాఖహార ర్యాలీ ఆదివారం పురవీధుల గుండా జరిగింది. బ్రహ్మర్షి పీతామహా పత్రిజీ ఆశయాలు ప్రతి ఒక్కరు నిర్వహించా లని జిల్లా అధ్యక్షుడు మహేష్ గౌడ్ తెలిపారు. సుమారు 500 మందికి పైగా పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు. నీటి యాంత్రిక జీవితంలో మానసి కంగా దృఢంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని తెలిపా రు. శాఖ ఆహారంలోనే అధిక పోష్ కాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమానికి చిట్టెం మాధవరెడ్డి, బండ్ల ఆంజనేయ రెడ్డి, రాజేందర్ గౌడ్, నారాయణ పెట్, వనపర్తి, ఆత్మకూర్, గద్వాల్, పాలమూరు పిరమిడ్ మాస్టర్స్ ధన్వాడ పిర మిడ్ మాస్టర్లు, నీరటి శ్రీనివాస్ నాయుడు, శైలజ హరినాథ్ రేణుక అనురాధ, సంధ్య, ఆంజనే యులు, నీలిబాలరాజు, సంద రాజశేఖర్, తదితర పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడపొద్దు: ఎస్సై

**లింగాల, జూలై13 ప్రభాతవార్త:** నిబంధనలకు విరుద్ధంగా మద్యం సేవించి వాహనాలు నడిపిస్తూ పట్టుబడితే కఠినచర్యలు తప్పవని ఎస్సై వెంకటేశ్వర్లుగౌడ్ వాహనాదారులను హెచ్చరించారు. ఆదివారం మండలపరిధిలోని మాగ్దూంపూర్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలను తమ వద్దనే ఉంచుకోవాలని, సరైన పత్రాలు లేని వాహనాలకు చలాన్లు విధించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన నాలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## వరద తగ్గుముఖం

(మొదటి పేజీ తరువాయి)

నీటినిల్వఉన్నది. పవర్ హౌస్‌కు 36035 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 6,823 క్యూసె క్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -1కు 1,300 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1030 క్యూసెక్కులు, కుడి కాలువకు 470 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 950 క్యూసె క్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 47068 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

## 883 అడుగులకు చేరిన శ్రీశైలం డ్యాం

**- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి**

శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఒక గేటు ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నది. కర్ణాటక నుంచి కృష్ణా నదికి భారీగా వరద జలాలు రావడంతో జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నమోదవుతున్నది, ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులగాను ప్రస్తుతం 883.30 అడుగులకు చేరుకున్నది. ఇక నీటి నిల్వలు 215 టీఎంసీలకుగాను 206.0996 టీఎంసీలకు చేరుకున్నాయి. ప్రాజెక్టు ఒక గేటు 10అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా భారీ ఇన్ ఫ్లోతో ఏపీలోని పోతిరెడ్డిపాడుతో పాటుగా తెలంగాణలోని మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి నీళ్లు విడుదల చేస్తున్నారు. అలాగే కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రానికి 33,067 క్యూసెక్కులు, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రానికి 35,315 క్యూసెక్కులు ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలకు విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. జ్రూరాల నుంచి 36035 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 30,728క్యూసెక్కుల నీళ్లు వచ్చి డ్యాంలోకి చేరుతున్నాయి. మొత్తంగా శ్రీశైలం జలాశయం నుంచి 73568 క్యూసెక్కులు దిగువకు నాగార్జున సాగర్‌కు విడుదలయ్యాయి.

## మైనార్టీల స్థితిగతులపై

## పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

అందుకనే పరదచాటున ఉన్న మైనార్టీ మహిళలు తమ హక్కుల కోసం రోడ్ల పైకి వచ్చి ఉద్యమాలు చేస్తున్నారని అన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాతంత్ర హక్కులను హరిస్తే తిరగబడతామని హెచ్చరించారు. భేటీ పడావో భేటీ బచావో అంటూ నినాదాలు ఇస్తున్న బీజేపీ తాను అధికారంలో ఉన్న యూపి, బీహార్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఆడ పిల్లల్లపై జరుగుతున్న అరాచకాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. ఉత్తరప్రదేశ్ లో యోగి ఆదిత్యనాథ్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆకలి పేదరికం నిరుద్యోగం పెరిగిందని వాటి నుండి తప్పించుకోవడానికి మతాన్ని అడ్డం పెట్టుకుంటున్నారని విమర్శించారు. బీజేపీని నడిపిస్తున్న ఆర్ ఎస్ ఎస్ తన ఆలోచనలను ప్రభుత్వ విధానాలలో అమలు పరుస్తున్నదని, అందులో భాగంగా శాస్త్రీయ విద్యకు తిలోదకాలు ఇచ్చి మత ప్రాతిపదికన అంశాలు విద్యలోకి చొప్పించ్చిందని విమర్శించారు. ఢిల్లీలో రామ్‌లీలా మైదానంలో నెహ్రూ అంబేద్కర్ బొమ్మలను ధ్వసం చేసిన ఆర్ ఎస్ ఎస్ కు, భారత స్వాతంత్ర పోరాటంలో పాల్గొనని బీజేపీ కి రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదువేల మైనారిటీ పాఠశాలలను మూసివేశారని విమర్శించారు. నాడు కాంగ్రెస్ ప్రకటించిన ఏమర్జెని సైతం నేడు, బీజేపీ మత పరంగా విభజించి గొడవలు సృష్టించి రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నదని విమర్శించారు. ఈ సందర్భంగా ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్బాస్ మాట్లాడుతూ మైనార్టీలు విద్య ఆర్థిక రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్నారని, మైనార్టీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని, ఏ రాజకీయ పార్టీ వచ్చిన మైనార్టీలను ఓటు బ్యాంకు రాజకీయాలుగా వాడుకుంటున్నారని అన్నారు. తెలంగాణ గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ దేశంలో లౌకిక విలువల పరిరక్షణ కోసం, ప్రజల మధ్య ఐక్యత పెంచడం కోసం ఆవాజ్ రాష్ట్ర మహాసభలు జరగాలని ఆ దిశగా విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జ సరితమ్మ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీ సానుకూలంగా ఉన్నదని, విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో జనాభా ప్రాతిపాదికన రాజకీయ అవకాశాలు కల్పించి, సంక్షేమ పథకాలు అమలుకు ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. ఈ బహిరంగ సభలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏం డి జబ్బార్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి, న్యాయవాది మధుసూదన్ బాబు, అఖిల పక్ష నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు తాహేర్, మాజీ కౌన్సిలర్ ఇషాక్, ఇక్బాల్ పాషా , సుంకర ప్రభాకర్ , కుర్వ పల్లయ్య, గంజిపేట రాజు, సీఐటీయూ వివి నరసింహ, మహిళా సంఘం నర్మదా వివిధ సామాజిక ప్రజా సంఘాలు రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేర్వేరుగానే పంచాయతీ ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

ఎన్నికలు 29 గ్రామపంచాయతీలు 15 ఎంపిటిసి స్థానాలు ఇప్పటికీ ఉమ్మడి ఇటికాల మండలంలో కొనసాగేవి. ఎర్రవల్లి గ్రామపంచాయతీని మండలంలో ఏర్పాటు చేసుకోవాలని 15 గ్రామ పంచాయతీల అప్పటి ప్రజా ప్రతినిధులు ప్రజలు ముందుకు వచ్చి ఎర్రవల్లి చౌరస్తా నుండి 17 కిలోమీటర్ల దూరం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కాలినడకన వచ్చి మండలా న్ని ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. అంతేకాక ఎర్రవల్లి చౌరస్తాలో నిరాహార దీక్షలు వంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టడంతో 2023 సంవత్సరం జూలై ఆగస్టు మాసంలో రాష్ట్ర ప్రభుత్వం ఎర్రవల్లి మండలాన్ని కొత్త మండలంలో ఏర్పాటు చేశారు.

**వేరువేరుగా ఎన్నికలు...** గ్రామ పంచాయతీల సర్పంచుల పదవి కాలం పూర్తయి 16 నెలలు ఎంపిటిసి. జడ్పిటిసి పదవి కాలం పూర్తయి 13 నెలలు గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామపంచాయతీలలో అభివృద్ధి కార్యక్రమాలు అంతంతమాత్రంగానే మిగిలిపోయాయి. హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించడంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు భాను 2 రోజుల క్రితమే రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో సర్పంచులు ఎంపిటిసి జడ్పిటిసి రిజర్వేషన్లను ప్రభుత్వం ఈ నెలాఖరు నాటికి ఖరారు చేసి ఆగస్టు నెలలో ఎన్నికలు నిర్వహించేందుకు కూడా ఎన్నికల సంఘం సిద్ధమవుతుంది. కాగా ఇటిక్యాల మండలంలో 14 గ్రామపంచాయతీలు.7 ఎంపిటిసి స్థానాలు. ఒక జడ్పీటీసీ స్థానానికి వచ్చే నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. అలాగే కొత్తగా ఏర్పడిన ఎర్రవల్లి మండలంలో 15 గ్రామపంచాయతీలు, 8 ఎంపిటిసి స్థానాలు, ఈ మండలంలో కొత్తగా జెడ్పిటిసి స్థానం పెరిగి కొత్త మండలంలో కేటాయించిన పంచాయతీల వారీగా స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

# మళ్లీ మొదటికి..

- జడ్చర్లలో పందుల బెడద
- 24వ వార్డులో ఇండ్ల మధ్యే పందుల పంపకం
- ఆందోళన చెందుతున్న పట్టణవాసులు
- వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రభలే అవకాశం

**జడ్చర్ల, జూలై13, ప్రభాతవార్త:** జడ్చర్లలో మళ్లీ పందుల బెడద మొదలైంది. ముఖ్యంగా పట్టణంలో పందుల సంచారం పెరిగిందని స్థానికులు వాపోతున్నారు. కొన్ని నెలలుగా పందుల సంచారం పెరిగిందని, పందుల బెడద నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. పందులను నియంత్రించాలని అధికారులను కోరుతున్నారు.



**24వ వార్డులో ఇండ్ల మధ్యే పెంపకం..** జడ్చర్ల పట్టణంలోని 24వ వార్డు విద్యానగర్ కాలనీలో ఒక కాంపౌండ్‌లో పందుల వ్యాపారులు పందులను వదిలిపెట్టారు. అసలే వర్షాకాలం ఈగలు దోమలు బెడద కొనే తట్టుకోలేక జనాలు నానా అవస్థలు పడుతుంటే పందుల వ్యాపారులు అవేవీ పట్టానట్టుగా పందులను యథేచ్ఛగా తీసుకువచ్చి పట్టణాల్లో వదులుతున్నారు. దీంతో స్థానికంగా ఉండే ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. చెత్తాచెదారం తో పాటు పందులు మురుగుగుంటలో మోరీల లో పడి చనిపోతున్నాయి. ఇది కాకుండా పందుల వలన అనేక రోగాలు చిన్న పిల్లలకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి పట్టణంలో పందులను ఏదేచ్ఛగా పెంచడంతోపాటు ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. పందుల వ్యాపారుల పైన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**అధికారుల చర్యలేవి..?** గతంలో పందులను ఒకేసారి ఇతర ప్రాంతాలకు తరలించగా స్థానికులు సంతో షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కొందరు నాయకులుపందుల తరలింపులో డబ్బులు దుర్వినియోగం జరిగిందని, మున్సిపాలిటీకి చెల్లించకుండా స్వాహా చేశారనే ఆరోపణలు సైతం ఎదుర్కోవడం తీవ్ర దుమారం రేపినా పట్టణవాసులు మాత్రం రెండేండ్లకు పైగానే పందుల బెడద నుంచి విముక్తి పొందామని సంతోషం వ్యక్తం చేశా రు. ఇంత వరకు బాగా నే ఉన్నా గత రెండు మూడు నెలలుగా పం దుల స్వైరవిహారం తిరిగి పెరగడంతో పట్టణవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికా రులు పందులను నియంత్రించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. పందుల పెంపకం దారులకు ఊరికి దూరంగా పందులను ఉంచాలని హెచ్చరికలు జారీ చేయాల్సి ఉన్నది. పట్టణాల్లో పందులను నియంత్రించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. అసలే వర్షాకాలం కావడంతో జనాలు ఆందోళన చెందుతున్నారు.



24వ వార్డులో ఇండ్ల మధ్య పందులను పెంచుతున్న దృశ్యం

# మత్స్య ఉపాధిని మెరుగుపరచుకోవాలి

**మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి .. నాణ్యమైన చేప పిల్లలను ఎంచుకోవాలి**

**బిజినేపల్లి, జూలై13 ప్రభాతవార్త:** మత్స్య కార్మిక కుటుంబాల ఉపాధిని మెరుగుపర్చి, వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకుగాను నాణ్యమైన చేప పిల్లల పెంపకంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించామని టైనీ ఫిన్స్ ఫిషరీస్ సీఈఓ స్వరూప్ సింగంశెట్టి అన్నారు. జిల్లాలోని మత్స్యకార సహకార సొసైటీల సభ్యులు ఆదివారం ఖానాపూర్ టైనీ ఫిన్స్ ఫిషరీస్ చేప విత్తనాల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. స్వరూప్ సింగంశెట్టి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం చెరువులలో వదులుతున్న ప్రతి చేప పిల్ల బతికేలా నాణ్యమైన చేప విత్తనాలను ఉత్పత్తి చేయిస్తున్నామని అన్నారు. నాణ్యమైన చేప పిల్లలను పెంచినట్లయితే మత్స్యకారుల ఉపాధి అవకాశాలు బాగుంటాయని ఉద్దేశ్యంతో అన్ని దశలలోనూ పకడ్బందీ పర్యవేక్షణ జరిపిస్తున్నామని చెప్పారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రితేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా తెలంగాణ రాష్ట్రంలోనే మంచినీటి చెరువులు ఉన్నాయని, సరైన అవగాహనతో చేపల పెంపకం చేపడితే మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగే అవకాశం లేకపోలేదు అన్నారు. కోనసీమ ప్రాంతాల నుండి చేప పిల్లలను దిగుమతి చేసుకునే క్రమంలో సమయంతో పాటు తెచ్చిన చేప పిల్లలు వదిలిన చెరువుల్లో సరైన నిర్వహణ లేకపోవడంతో మృత్యువాత పడుతున్నాయని తూకంలో నష్టంతో పాటు మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. జిల్లా మత్స్యకార సహకార సొసైటీ ఉపాధ్యక్షుడు తుమ్మల అల్లోజి మాట్లాడుతూ చేప పిల్లల కొనుగోలు లోనాణ్యమైన, ఆరోగ్యకరమైన చేప పిల్లలను, మంచి జాతి చేప పిల్లలను ఎంచుకోవడం వలన దిగుబడి పెరుగుతుంది అన్నారు. చేప పిల్లల కొనుగోలులో పరిమాణం, బరువు, చురుకు దనం గమనించాలి అని చెప్పారు. ఈ ప్రాంత వాతావరణ పరిస్థి తులకు అనుగుణంగా చేప పిల్లల ఉత్పత్తి చేపట్టడం వల్ల ఒకే రకమైన వాతావరణం, కృష్ణా జలాలు కావడం వల్ల చెరువుల్లో చేప పిల్లలు ఆరోగ్యవంతంగా ఎదిగి పది నెలల కాలంలోనే కిలో నుంచి కిలోన్నర తూకం వచ్చే అవకాశం ఉందన్నారు. మంచి నాణ్యమైన చేప పిల్లలను వృద్ధి చేసుకొని చేపల పెంపకంలో మంచి దిగుబడి పొందవచ్చును. చేప జాతి పిల్లలు, కావలసిన సమయంలో, కావలసిన పరిమాణంలో దొరకడం అనేది చేపల పెంపకంలో ఒక కీలక అంశం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫిషరీస్ సొసైటీ సెక్రటరీ వెంకటస్వామి, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తెప్ప తిరుపతయ్య, హరికృష్ణ, గొర్ల శ్రీనివాసులు, తిరుపతయ్య, మిద్దె యాదయ్య, సలేశ్వరం, బొందయ్య, కాశన్న సహదేవుడు, సైదులు, ఈర్ల శ్రీకాంత్, కాళ్ల లింగమయ్య, పిట్లల తిరుపతయ్య తదితరులు ఉన్నారు.



చేప పిల్లల పెంపకాన్ని పరిశీలిస్తున్న మత్స్యకారులు

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం అభినందనీయం...

**- అలరించిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం**

**- 50 ఏళ్ళు దాటిన వయసులో క్రికెట్ ఆడిన స్నేహితులు**

**- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 13 ప్రభాతవార్త:** పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం అభినందనీయమని నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో అదే పాఠశాలలో 1986 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పాల్గొని స్నేహితులు ఒకే చోట కలుసుకోవడం వల్ల వారిలో స్నేహభావం మరింతగా పెంపొందుతుందన్నారు. ప్రతి విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని ఆ దశను మళ్లీ నెమరు వేసుకోవడానికి స్నేహితులు అందరూ ఒకే చోట కలుసుకోవడం వల్ల బాల్యం గుర్తుకు వస్తుందని ఆయన అన్నారు. ఇలాంటి కలయికలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. చదువుకున్న పాఠశాలకు తమకు తోచిన సహాయం అందించినందుకు ఆయన అభినందించారు. పూర్వ విద్యార్థులు ఆరో ప్లాంట్ నిర్వహణ కోసం రూ.20 వేల అధిక సాయాన్ని పాఠశాల ప్రధానో పాధ్యాయుడుకి అందించారు. అదేవిధంగా గగ్గలపల్లి జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలకు రెండు క్రికెట్ కిట్స్ అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ స్నేహితులంతా ఒకే చోట కలుసుకోవడం తోపాటు క్రికెట్ క్రీడను కలిసి ఆడటం ద్వారా 55 సంవత్సరాల వయసులో కూడా తాము క్రీడలు ఆడడమే కాకుండా భవిష్యత్తు తరాలకు క్రీడల ప్రాముఖ్యతను స్నేహ భావాన్ని సమాజానికి అందించడమే ఈ క్రీడా పోటీల నిర్వహణ అని పూర్వ విద్యార్థులు సయ్యద్ ఫసియుద్దీన్, నాగరాజు, శివ కుమార్, విక్రం, రవీందర్ రావు, బాలరాజు తదితరులు అన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఎంతో ఆహ్లాద కరమైన వాతావరణంలో జరుపుకున్నట్లు వారు తెలిపారు. స్నేహితులమంతా ఒకే చోట కలుసుకోవడం తమకు ఎంతో సంతోషం కలిగించిందని భవిష్యత్తులో కూడా ఇలాంటి కలయికల కార్యక్రమాలను నిర్వహిస్తామని వారన్నారు. ఈ సమ్మేళనానికి యూఎస్, బెంగళూరు తదితర ప్రాంతాలలో స్థిరపడిన స్నేహితులు కూడా ఈ రోజు ఇక్కడికి రావడం అభినందనీయమని పూర్వ విద్యార్థులు అన్నారు.



క్రికెట్ ఆడిన పూర్వ విద్యార్థులతో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

# పేదలకు విశ్వాసం కల్పించేలా ముందుకు

**నెరవేరుతున్న పేదల ఆకాంక్షలు : ఎమ్మెల్యే కుచుకుల్ల రాజేష్ రెడ్డి**

**బిజినేపల్లి, జూలై 13 ప్రభాతవార్త:** పేదలకు ప్రభుత్వంపై విశ్వాసం కల్పించేలా ప్రజా ప్రభుత్వం నమ్మకం విశ్వాసంతో పనిచేస్తుందని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. నంది వడ్డేమాన్ గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆకాంక్షలను నెరవేరుస్తూ ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. రైతులకు పంట పెట్టుబడిగా అందించే రైతు భరోసా నిరుపేదలకు గృహవసతి కల్పించే ఇందిరమ్మ ఇల్లు ఆహార భద్రతను కల్పించే రైతుల కార్డుల జారీ పథకాలను పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌తో పాటు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, 500 రూపాయలకే మహిళలకు గ్యాస్ సిలిండర్, ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. గతంలో రైతు భరోసా సాయం పదివేల రూపాయలు ఉంటే ఈసారి ఎకరానికి ఏడాదికి 12 వేలకు పెంచామన్నారు. ఇందిరమ్మ పాలనలో ప్రజల దగ్గరికి వెళ్లాలన్న మార్పు తీసుకువచ్చామని ప్రజలకు జవాబుదారీగా ఉంటున్నా మన్నారు. త్వరితగతిన ఇళ్లు పూర్తి చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న రూ.5లక్షల ఆర్థిక సాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కతలప్ప, పంచాయతీ కార్యదర్శి లింగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దెరాములు, డీసీసీ ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు, మాజీ ఎంపీటీసీచంద్రశేఖర్‌రెడ్డి, రేముద్దుల రమేష్, అవుల రాములు, వీరశేఖరాచారి, వేమ వెంకట్రాములు, రామకృష్ణ, గోవాశేఖర్ రామచందర్, జయకృష్ణ, అమృత్‌రెడ్డి, రాగి మధుసూదన్‌రెడ్డి, నరేందర్ గౌడ్, పండ్లపాష, ముక్తార్, భగవంత్‌గౌడ్, కత్తెఈశ్వర్, గోవింద్ నాయక్, వాల్యా ,రామచందర్ ఆయా గ్రామాల మండల నాయకులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

## బిజెపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో రాంచందర్‌రావుకు ఘన సన్మానం



రాంచందర్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

**నారాయణపేటటౌన్, జూలై 13 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావును శనివారం హైదరాబాదు పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బిజెపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో జిల్లాల కన్వీనర్లు పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు. నారాయణపేట జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ ప్రత్యేకంగా సన్మానించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారినుద్దేశించి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సంక్షేమ నిధి, భీమా, హౌజింగ్ కార్పోరేషన్ ద్వారా ఇళ్ల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు.

## అపూర్వ సమ్మేళనం



ఫోటో సెషన్‌లో 2007, 08 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు

**జడ్చర్ల, జూలై 13, ప్రభాతవార్త:** జడ్చర్లలోని దయానంద విద్యా మందిర్ ఉన్నత పాఠశాల జడ్చర్లలో 2007,2008లో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ సంగీతా సాహిత్య అకాడమీ చైర్మన్ బాద్మిశివకుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వపు ప్రధానోపాధ్యాయులు ద్యాసమోని కృష్ణయ్య, జయప్రకాష్, శివాజీ, ప్రశాంత్, రాజేందర్, రత్న మాల టీచర్, ఉషటీచర్, శారద టీచర్, రామేశ్వర్ టీచర్, పూర్వ విద్యార్థులు శివశంకర్, రామకృష్ణ, బాలనాగేందర్, పి.లావణ్య, జోష్ణదేవి, సౌజన్య, జ్యోతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## పెబ్బేర్‌కు చేరుకున్న విశ్వబ్రాహ్మణ సాంస్కృతిక చైతన్య పాదయాత్ర

**పెబ్బేరు, జూలై 13 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణంలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ చైతన్య పాదయాత్ర ఆదివారం పెబ్బేరుకు చేరుకున్నారు. విశ్వబ్రాహ్మణులందరూ ఏకమై రాజకీయంగా అన్ని రంగాల్లో ఎదగాలని హైదరాబాద్ నుండి శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం వరకు సాగే పాదయాత్ర పెబ్బేరుకు చేరుకొని స్థానిక వీర బ్రహ్మంగారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల విశ్వబ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**ఊట్కూరు, జూలై 13 ప్రభాతవార్త :** ఊట్కూరు మండల కేంద్ర పరిధిలోని తిప్రస్ పల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న గున్మకుల హనుమంతును ఊట్కూర్ పోలీస్ సిబ్బంది పట్టుకొని, ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేయడమైనది. మండల పరిధిలో ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేసినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకొనబడతాయని ఎస్సై రమేష్ తెలియజేశారు.

## ఎస్సీ హాస్టల్ డ్రైనేజీ పైపు లీకేజీ

**ఇబ్బందుల్లో కాలనీవాసులు..**

**హాస్టల్ సిబ్బందికి పలుమార్లు తెలియజేసిన పట్టించుకోలేదు**



డ్రైనేజీ పైపు లీకై బయట ప్రవహిస్తున్న దృశ్యం

**మద్దూర్, జూలై13 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూర్ పట్టణ కేంద్రంలో ఎస్సీ హాస్టల్ డ్రైనేజీ పైప్ లీకేజీ నుంచి మురికి నీరు బయటకు రావడంతో ఆ కాలనీవాసులు ఆ వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ హాస్టల్ సిబ్బందికి ఎన్నిసార్లు తెలియజేసిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆ కాలనీకి చెందిన రొయ్యలినవీన్ తెలిపారు. ఈ మురికి వాసనకు బయటకి రావాలంటే భయమేస్తుందని వారు తెలిపారు. ఈమురుగునుంచి దోమలు ఈగలు ప్రబలి విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. ఇది వానాకాలం కావడంవలన ఎప్పుడు ఏమవుతుందో తెలియని పరిస్థితులు ఉన్నాయి. కాబట్టి వెంటనే అధికారులు స్పందించి ఆడ్రైనేజీని మరమ్మతు చేయించాలని కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు.

## ఘనంగా కోట మైసమ్మ బోనాలు

**నర్వ, జూలై 13 ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల మహోత్సవం ఆదివారం ప్రారంభమైంది. ఆషాడ మాసం మొదటి వారంలో నర్వ మండల కేంద్రంలో కోట మైసమ్మకు భక్తులు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా బోనాల మనోత్సవాన్ని ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికిబొట్టు, బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ రాజకీయపార్టీల నాయకులు, మాజీ ప్రజా పరతినిధులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. భక్తులకు ఆలయ ఆవరణలో ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

